

జెఇఇ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జెఇఇ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు తొలిరోజు ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 180 మందికి 175 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 102 మందికి 99 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు.

మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 177 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 104 మందికి వంద మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

కోళ్లపై వైరస్ పంజా..!

తొలుత నాటుకోళ్లు, ఆపై బాయిలర్, తాజాగా లేయర్ కోళ్లపై ప్రభావం

వందల సంఖ్యలో కోళ్ల మృతి

తల్లడిల్లుతున్న రైతులు


కోళ్ల ఫారం


వైరస్‌తో చనిపోయిన కోళ్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్

పౌల్ట్రీ పరిశ్రమ రైతులు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా అంతుచిక్కని వైరస్ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తణుకు పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో ఒకే రోజు వంద కోళ్లు మృత్యువాత పడడం దీనికి నిదర్శనం. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 370 కోళ్ల ఫారాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 2.50 కోట్ల వరకూ లేయర్ కోళ్లు ఉండగా గత కొద్దిరోజులుగా రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడడం గమనార్హం. తొలుత ఈ వైరస్ నాటు కోళ్లకు పాకింది. దీంతో నాటు కోళ్లు సైతం మృత్యువాత పడ్డాయి. ఈ ప్రభావం సంక్రాంతి కోడిపందేల్లో కూడా కనిపించింది. నాటు కోళ్లు లేక చాలా వరకూ బరులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రస్తుతం ఈ వైరస్ లేయర్ కోళ్లకు సైతం విస్తరించింది. సాధారణంగా గుడ్ల కోసం పెంచే లేయర్ కోళ్ల విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. కోడి గుడ్డు పెట్టే సమయం వరకూ దానికి రూ.300 ఖర్చు అవుతుంది. 18వ వారం నుంచి గుడ్డు పెట్టడం మొదలు పెట్టి 100 వారాల వరకూ గుడ్లు ఉత్పత్తి చేస్తుంది. గుడ్డు ఉత్పత్తి కోసం రైతుకు గుడ్డు నిమిత్తం రూ.4.60 పైసలు ఖర్చవుతుంది. గుడ్ల ఉత్పత్తిలో ఏపీలో ఉభయగోదావరి జిల్లాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాలం ఇక్కడ నుంచి గుడ్లు ఎగుమతి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం వైరస్ ప్రభావంతో రైతులు కోళ్లకు సంబంధించిన మందులు, మేతల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా కోళ్లు వైరస్ బారిన పడకుండా ముందస్తుగా తరచూ వ్యాక్సిన్లు వేస్తుంటారు. గుడ్డు దిగుబడి పెంచేందుకు కోళ్లకు తగిన ఆహారాన్ని సరఫరా చేస్తుంటారు. అయితే ఉన్నట్టుండి ప్రస్తుతం కోళ్లు మృత్యువాత పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ సుమారుగా రెండు లక్షల వరకూ కోళ్లు అంతు చక్కని వ్యాధి బారినపడి మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ వైరస్ బారిన పడిన కోళు ఐదు నుంచి 6 గంటల్లోనే మృత్యువాత పడుతున్నాయి. శరీర ఉష్ణోగ్రత బాగా పెరగడం, నోటి నుంచి సొంగ కార్చుకుంటూ చనిపోతున్నాయి. కోడి వయసుతో సంబంధం లేకుండా మృత్యువాత పడుతుండటం రైతులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

కోళ్ల పరిశ్రమ రైతులు నిర్ణీత వయసులో కోళ్లకు వ్యాక్సిన్లు వేయించుకోవాలి. ప్రస్తుతం వివిఎన్‌డి వైరస్ ప్రభావం ఎక్కువగా ఉందని, ఇది ఆర్‌డి వైరస్‌లో ఒక స్ట్రైన్ అని పశు సంవర్ధక వైద్యులు సూచిస్తున్నారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా అదేవిధంగా కోళ్లలో రోగ నిరోధక శక్తి పెరిగేందుకు తగిన ఆహారం ఇవ్వాలని చెబుతున్నారు. కోళ్ల ఫామ్ లోకి వచ్చే వాహనాలు, సిబ్బంది పరిశుభ్రత పాటించడం ద్వారా కోళ్లలో వైరస్ వ్యాప్తిని నివారించడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. చనిపోయిన కోళ్లను ఖననం చేసే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ వైరస్ సోకిన కోళ్లకు యాంటీబయాటిక్స్ మందులు వాడడంతోపాటు బయోభూస్టర్ స్ప్రే చేయడం ద్వారా నష్టం తగ్గించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

దేవాదాయ భూముల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ భూముల పరిరక్షణకు సూచించిన మార్గదర్శకాలను సంబంధిత శాఖ అధికారులు అధ్యయనం చేసి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో భూ పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూముల పరిరక్షణ, లీజుదారుల నుంచి లీజు మొత్తాలను వసూలు చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 25 మండలాల్లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను మండలాల వారీగా సమగ్ర నివేదికను తయారుచేసి శుక్రవారం నాటికి వివరాలు సమర్పించాలని కలెక్టర్ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నివేదికలో మండలాల్లోని దేవాదాయ శాఖ మొత్తం భూమి (సర్వే నంబర్లతో), అన్యాక్రాంతమైన భూమి, లీజుకిచ్చిన భూమి, ఖాళీగా ఉన్న భూమి, సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశించారు. దీని ఆధారంగా రెవెన్యూ పరంగా చేయాల్సిన ప్రక్రియను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల తహశీల్దార్లకు తెలియపర్చాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ భూముల పరిరక్షణకు సూచించిన మార్గదర్శకాలను సంబంధిత శాఖ అధికారులు అధ్యయనం చేసి దేవాదాయ భూముల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్‌కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఎంవి.రమణ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిపిఒ కె.అనురాధ, ల్యాండ్ సర్వే ఎస్‌హెచ్‌ఎండి అన్సారీ, జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, వివిధ దేవాలయాల ఇఒలు, ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్స అందించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఇంటింటి సర్వేలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా కుష్టు వ్యాధిపై ప్రచురించిన అవగాహనా పోస్టర్లు, కరపత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకూ జిల్లాలో కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని 'కుష్టు' వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం కావాలన్నారు. కుష్టు నివారణకు ప్రభుత్వపరంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. కుష్టు లక్షణాలున్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురదలేని మచ్చలు, చెవులపై, వీపుపై నొప్పిలేని బుడుపులు, నొప్పిగా ఉన్న నరాలపై లక్షణాలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించబడుతోందన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ మాలిని, జిల్లా కుష్టువ్యాధి నివారణ అధికారి ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన చట్టాలు రైతు మెడకు ఉరితాళ్లు

రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆందోళన


అభివాదం చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు రైతు మెడకు ఉరితాడులా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టం వంటి కేంద్రం నూతన చట్టాలు తీసుకొస్తోందని రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు పవరుపేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై జరగనున్న నిరసనలు, ర్యాలీలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.సుందరరావు, టి.సత్యనారాయణ, ఐఎఫ్‌టియు ఏలూరు నగర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, నాయకులు బి.సత్యనారాయణ మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాల్లోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలను తీసుకొస్తోందని ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు తెచ్చేందుకేనని తెలిపారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలు మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు. సహకార వ్యవస్థలన్నీ కార్పొరేట్ కంపెనీల హస్తగతం అవుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధాన చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాధారిత పరిశ్రమాధిపతులు, ఎగుమతి దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతులు పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే ఇంకా ఉందన్నారు. వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతుందని చెప్పారు. ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకొనేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీములు ఇకపై ఉండవన్నారు. ఇప్పటికే కేంద్రం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్ల అమలుకు పూనుకుందన్నారు. రైతాంగం జరుపుతున్న పోరాటాలకు తలొగ్గి చర్చలు జరపడానికి కేంద్రం అంగీకరించిందని, ఈ చర్చల్లో ప్రస్తుతం తెస్తున్న చట్టాలు రద్దు చేసి రైతులు కోరుతున్న సి2050 ప్రకారం మద్దతు ధరలు గ్యారంటీ చట్టం, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం తేవాలన్నారు. ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ విస్తరణ, కౌలు రైతులకు రక్షణ సాధించడంతోపాటు కార్మికులకు నష్టకరమైన నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయించడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

రెవెన్యూ సదస్సుల్లో, రీసర్వే గ్రామ సభల్లో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో వివిధ రెవెన్యూ అంశాలపై ఏలూరు డివిజన్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బుధవారం సమీక్షించారు. ఈ సమావేశంలో రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీల నమోదు, పరిష్కారం, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల నమోదు, పరిష్కార ప్రక్రియ పురోగతి, 22 కేసుల స్థితి, వెబ్ ల్యాండ్ పోర్టింగ్/కరెక్షన్ కేసుల స్థితి, పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులు స్థితి, ల్యాండ్ బ్యాంక్ పురోగతి, ఎపిసేవా, మీసేవలో పెండింగ్‌లో ఉన్న బిఎస్‌ఎల్‌ఎ కేసుల క్లియరెన్స్ స్థితి , పున:సర్వేపై స్థితి, భూ సేకరణ, భూమి అన్యాక్రాంతం కేసులపై స్థితి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ అంశాలకు సంబంధించి త్వరితగతిన పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహశీల్దార్లు, రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పామాయిల్ తోటల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, చివరికి చనిపోయినా అధికారులు పట్టించుకోవడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముండూరు గ్రామంలో బుడపన సింహాచలం కుమారుడు శ్రీను తాడిచెట్టు మీద ఆకుల కోస్తుండగా అదుపుతప్పి అతని గెడ విద్యుత్ తీగలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. పామాయిల్ తోటల్లో పని చేస్తున్న వ్యవసాయ కార్మికులకు విద్యుత్ షాక్ తగిలి ప్రమాదాలకు గురై పిట్టల్లా రాలిపోతున్నారని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నుంచి గాని, విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖల నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదని పేర్కొన్నారు. అనేక మంది కార్మికులు చనిపోయారని, జిల్లా అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లినా వారికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని తెలిపారు. శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, కలెక్టర్ కలుగజేసుకుని పామాయిల్ కార్మికుల, వ్యవసాయ కార్మికుల మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలిపారు. ఈ రెండు మూడు నెలల్లోనే సుమారు ఐదుగురు కార్మికులు చనిపోయారని తెలిపారు. వారి కుటుంబాలకు వ్యవసాయ కార్మిక సంఘం, పామాయిల్ కార్మిక సంఘం అండగా ఉంటుందని తెలిపారు. శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రపంచ మానవాళికి దిక్సూచి లెనిన్

శత వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రపంచ మానవాళికి దిక్సూచి లెనిన్ అని, ఆయన చిన్నతనం నుంచే సేవా, కార్మిక దృక్పథంతో నడిచిన వ్యక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ కారల్ మార్క్స్, ఎంగిల్స్ రాసిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, ప్రణాళికను అధ్యయనం చేసి రష్యాలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి కార్మికులను, రైతులను, ప్రజలందరినీ ఐక్యం చేసి వీరోచిత పోరాటాలు నిర్వహించి రష్యాలో కమ్యూనిస్టు పార్టీని అధికారంలోకి తెచ్చిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ప్రపంచంలోనే కార్మికులకు సమాన హక్కుల కల్పన కోసం, రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కూలీలకు హక్కులు, దేశం అభివృద్ధి కావాలంటే సంపద మొత్తం ప్రజలందరికీ సమానంగా పంచాలని లెనిన్ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. లెనిన్ స్ఫూర్తితో కమ్యూనిస్టు సిద్ధాంతం అనేక దేశాల్లో అమలు చేసి రాజ్యాధికారంలోకి వచ్చాయని, భవిష్యత్తులో భారత దేశంలో కమ్యూనిస్టు సిద్ధాంతం రాజ్యాధికారం కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో కేంద్రంలో నెగ్గిన బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంతో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కుట్రలు పన్నుతోందని, దేశంలోని ప్రజలందరినీ కులం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తుందన్నారు. ప్రస్తుత దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టు సిద్ధాంతం కీలకంగా మారిందని, మతోన్మాదాన్ని ఎదుర్కోవటం కోసం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు, ప్రజలు సిపిఎం చేసే పోరాటాలకు మద్దతు పలకాలని, రాజ్యాంగాన్ని కాపాడడం కోసం అందరూ కలిసి రావాలని, అప్పుడే ప్రజలంతా ఐకమత్యంగా కలిసి ఉంటారని, అప్పుడే లెనిన్‌కి ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జె.సూర్యచంద్రం, ఎ.ప్రభాకరరావు, వై.సీత, పటాన్, మస్తాన్, ఎన్.వెంకన్న, కె.సుబ్బారావు, డి.ఆశీర్వాదం, పి.సునీల్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

17 మంది గ్యాస్ డీలర్లకు నోటీసుల జారీ

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

దీపం పథకం అమలుపై సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

దీపం పథకం లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారించి 17 మంది ఎల్‌పిజి డీలర్లకు నోటీసులు ఇచ్చినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో బుధవారం దీపం పథకం అమలుపై జిల్లాలోని గ్యాస్ డీలర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖాధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపం పథకంపై లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ అనంతరం రుజువైన సదరు గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. లబ్ధిదారులు దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి చర్యలకు పాల్పడితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే వినియోగదారుడు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ సేల్స్ అధికారికి, తహశీల్దార్, పౌర సరఫరాల తహశీల్దార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వారికి ఫిర్యాదు చేయాలని లేదా టోల్ ఫ్రీ నెం 18004256453/1967 ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.సత్యనారాయణరాజు, హెచ్‌పిసిఎల్ ఎం.వెంకటేశ్వర్లు, ఐఒసిఎల్ ప్రసాద్, తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్, పౌర సరఫరా డిప్యూటీ తహశీల్దార్లు, జిల్లాలో ఉన్న గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో టెక్‌జైట్-25 వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో ప్రతివార్షికంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతికోత్సవం టెక్‌జైట్-25కు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ www.teckzite.org బుధవారం నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్‌జైట్25 వంటి ప్రోగ్రామ్‌లు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని, వారు తమ ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధిని చాటుకునేందుకు ఇదొక గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఇలాంటి టెక్ ఫెస్టులు విద్యార్థుల్లో సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడతాయని వివరించారు. ఈ సందర్భంగా నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించేందుకు, నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్‌డిసిఎసి కన్వీనర్ డాక్టర్ బి.జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ టెక్‌జైట్ 25లో వివిధ ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఇతర విశ్వవిద్యాలయాలు, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ టెక్‌ఫెస్ట్‌లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని, వారిలో నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు అనేక పోటీలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. టెక్‌జైట్-25లో భాగంగా రోబోటిక్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్ హ్యాకథాన్, వివిధ విభాగల ఇంజినీరింగ్‌కు సంబంధించిన ప్రదర్శనలు, వినూత్న ఆవిష్కరణలు జరగనున్నాయి. విజేతలకు రూ.ఐదు లక్షల విలువైన ప్రైజ్ మనీ, సర్టిఫికెట్లు అందించనున్నారు. ఇక టెక్‌జైట్-25 మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు, ప్రముఖ పరిశ్రమలు, రీసెర్చ్ సంస్థలు, మల్టీనేషనల్ కంపెనీలను కూడా కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న సంస్థలు, సహకారం అందించాలనుకునే సంస్థలు teckzite@rguktn.ac.in సంప్రదించవచ్చని తెలిపారు. టెక్‌జైట్-25 గురించి పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, ఈవెంట్లలో పాల్గొనడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి విద్యార్థులు, పరిశోధకులు సంస్థలు www.teckzite.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నూజివీడు క్యాంపస్ ఎఒ డాక్టర్ లక్ష్మణరావు, విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ డీన్ శ్యామ్, కళాశాల డీన్ రత్నాకర్, సిఎఒ బండి ప్రసాద్, ఎస్‌డిసిఎసి కన్వీనర్ డాక్టర్ బి.జ్యోతిలాల్‌నాయక్, వివిధ విభాగాల అధిపతులు, ఎస్‌డిసి ఎసి కోర్ టీమ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి హేలాపురి బాలోత్సవం

వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ వేదికగా ఐదో పిల్లల సంబరాలు


సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం ఛైర్మన్ ఆడుసుమిల్లి నిర్మల, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ప్రకటించారు. అన్నే భవనంలో బాలోత్సవం కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన బాలోత్సవం సన్నాహక కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2019 నుంచి హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. హేలాపురి బాలోత్సవానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దల నుంచి అపూర్వమైన స్పందన వస్తోందన్నారు. వట్లూరులో ఉన్న సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో బాలోత్సవం జరుగుతుందన్నారు. 69 అంశాల్లో నర్సరీ నుంచి పదో తరగతి విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించే వేదికగా బాలోత్సవం కొనసాగుతోందని వివరించారు. 23న ఉదయం పది గంటలకు కరెన్సీ నోట్లు, ఫ్యాన్సీ కాయిన్స్, మోటివేషన్ ఎగ్జిబిషన్‌తో బాలోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. బాలోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు పోలవరానికి మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్నారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్ నిర్మాణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ వినియోగంపై రాష్ట్ర జలవనరుల శాఖ కేంద్ర జలశక్తి సంఘం, విదేశీ నిపుణులు స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఆసక్తికరంగా మారింది. ఉదయం 7.30 గంటలకు పాలకొల్లు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి పది గంటలకు మంత్రి పోలవరం ప్రాజెక్టుకు చేరుకుంటారు. పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ పోలవరం ప్రాజెక్టు పరిశీలనా కార్యక్రమంలో పాల్గొంటారు. భోజన విరామానంతరం 2.30 గంటలకు విజయవాడ తరలి వెళ్తారు.

పోలీసు సిబ్బందికి ఉపయోగపడేలా డైరీ

ఆవిష్కరణలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్ వెల్ఫేర్ వారి ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎంతో కష్టపడి సిబ్బందికి నిత్యం ఉపయోగపడే విధంగా అన్ని అంశాల్లో క్రోడీకరించి సిబ్బందికి డైరీని రూపొందించినట్లు చెప్పారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం వారు, ఆర్‌ఐ పవన్‌కుమార్ ఎంతో కష్టపడి డైరీని రూపొందించారని, వారిని అభినందించినారు. సిబ్బంది ప్రతిరోజు నిర్వర్తించే ఉద్యోగ నిర్వహణ కార్యక్రమాల్లో డైరీ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సిబ్బందికి కావాల్సిన అన్ని అంశాల్లో సహాయపడుతుందన్నారు. డైరీని రూపొందించిన సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్‌ఎస్‌ఎస్.శేఖర్, ఏలూరు డిఎస్‌పి డిటిసిబి ఎస్‌పి ప్రసాద్‌రావు, ఎఆర్‌డి ఎస్‌పి చంద్రశేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయం ఎఒ బివిఎస్ ఆర్‌కె.నాయక్, పోలీస్ కార్యాలయం సువర్చల, ఆర్‌ఐ పవన్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ శానం రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది, ప్రధాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ఏజెన్సీ గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల నుంచి రూ.60 లక్షలతో పండువారిగూడెం నుంచి తపస్వివారిగూడెం వరకు మెటల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ లత, సర్పంచి సున్నం ఉషారాణి, పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపిటిసి సభ్యులు సురేష్, సుధారాణి, ఎఇ రహీం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు టౌన్‌లో దొంగతనాలు, ఇతర నేరాలను నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కైకలూరు టౌన్ సిఐ పి.కృష్ణ చెప్పారు. కైకలూరు పోలీస్‌స్టేషన్‌లో టౌన్‌లో ఉన్న గోల్డ్ షాపు యజమానులందరితో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ నేర నిరోధంలో సీసీ టివి ఉపయోగాల గురించి వివరించారు. అన్ని గోల్డ్ షాపుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కైకలూరు టౌన్‌లో ఒక ప్రాజెక్టు వర్క్‌గా కైకలూరు టౌన్ పోలీస్ వారు టౌన్ అంతా కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు గోల్డ్ షాపు యజమాని సహాయ సహకారాలు అందించాలని కోరారు. టౌన్ ఎన్‌జిఒ కాలనీలో డిసిఎన్ రాజు సహకారంతో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల పరిధిలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసే దిశగా సిబ్బంది కృషి చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో వెలుగు సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక డ్వాక్రా మహిళల లబ్ధి కోసం అనేక పథకాలు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా గ్రూపుల్లో లేకుంటే వారితో నూతన గ్రూపులను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎన్.ఝాన్సి, సీసీలు అరుణ, బోసు, సత్యనారాయణ, విఒఎలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి

అనంతరం క్యాంపు కార్యాలయంలో జనసేన నాయకురాలు ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి ఎంఎల్ఎ చిర్రి బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలను ఆమె కోరారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సొమ్ము అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎంతో మంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది ఉద్యోగ విరమణ చెందిన ఉపాధ్యాయులు మంచి ఆరోగ్యంతో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో బుధవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో పనిచేస్తూ రిటైర్‌మెంట్ అయిన ఉపాధ్యాయులు ఎనిమిది మందికి, అనారోగ్య కారణాలతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఒకరికి, మరణించిన ఒకరి కుటుంబ సభ్యులకు వారికి చెల్లించాల్సిన ప్రావిడెంట్ డబ్బులను మొత్తం పది మందికి చెక్కులు రూపంలో రూ.39.28 లక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, మేనేజర్ మూర్తి, అకౌంటెంట్ లింగేశ్వరి ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులు సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని చింతలపూడి ఎడిఎ బి.నాగకుమార్ సూచించారు. మండలంలోని బంధంచర్ల, కేతవరం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి బి.సుమలత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగకుమార్ రైతులతో కలిసి మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయిల్‌పామ్ నవభారత్ కంపెనీ 15 రోజులకు నగదు అందిస్తుందని, వెంటనే నగదు చెల్లింపులు జరిగేలా చూడాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఇ పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కైలు కార్డులు పొందాలన్నారు. పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి బి.సుమలత ఎన్‌పిఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న పశు ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొర్రగుంటపాలెంలో పశుఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో రెండు గేదెలకు కృత్రిమ గర్భధారణ, 15 గేదెలకు చూడి పరీక్షలు, 12 గేదెలకు నట్టల మందులు, 200 గొర్రెలకు నట్టలు నివారణ మందులు, 12 గేదెలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీ పశు వైద్యులు ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు. ముదినేపల్లి వెటర్నరీ డిస్పెన్సరీ పరిధిలో పెనుమల్లిలో డాక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పిఐ ఎ.మస్తానయ్య చెప్పారు. పట్టణంలోని శ్రీ శారద కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో ఏర్పడే అనర్థాల గురించి వివరించారు. గంజాయి, కొకైన్ ఇతర మాదక ద్రవ్యాల వినియోగంతో నరాల బలహీనత వస్తుందన్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుందని హెచ్చరించారు.

ఉచిత బ్యూటీ వెల్‌నెస్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో పిఎం విశ్వకర్మ ద్వారా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా బ్యూటీ వెల్‌నెస్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధాన అధికారి దేవరకొండ భూషణం తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు అసిస్టెంట్ బార్బర్ సర్వీసెస్ సెలూన్ కోర్సుకు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రామకృష్ణ 83740 39719 సంప్రదించవచ్చని చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని దోసపాడు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలను దెందులూరు తహశీల్దార్ బి.సుమతి బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే భోజనం నాణ్యత, సరుకుల స్టాకు, హాజరు, తాగునీరు, విద్యుత్, క్రీడా ప్రాంగణం అంగన్వాడీలో ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు.

కొనసాగిన పెన్షన్ల తనిఖీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో రెండో రోజు బుధవారం పక్షవాతానికి సంబంధించిన పెన్షన్ల తనిఖీ కొనసాగింది. మొదటిరోజు 15, రెండో రోజు ఎనిమిది మొత్తం 23 పెన్షన్లను తనిఖీ చేసినట్లు డాక్టర్లు పి.గాంధీ, సిహెచ్.విజయకుమార్ తెలిపారు. ఎల్ఎన్‌డి పేట, ప్రగడపల్లి, ఇటుకలకోట గ్రామాల్లో ఉన్న పక్షవాతానికి సంబంధించిన పెన్షన్లు తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

రోడ్డును నాణ్యంగా నిర్మించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నుంచి తీగలవంచ రోడ్డును నాణ్యంగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు ఆర్‌విఎస్.నారాయణ డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి నుంచి తీగలవంచ శివారు కృష్ణనగర్ వరకు కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు పరిశీలించి నాణ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

30న వేలం పాట

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చే నెల 25వ తేదీన జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించగా ఎవరూ పాల్గొనకపోవడంతో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్యనిర్వహణాధికారి విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మహాశివరాత్రి పండగ పురస్కరించుకుని ఆలయం వద్ద భారీకేడ్లు, ప్రసాద తయారీ, పారిశుధ్య కార్మికులు, వంట సామగ్రి, భోజనం తయారీ, టెంట్ షామియానా పలు కార్యక్రమాలకు టెండర్ పాడుకునేవారు పాల్గొనకపోవడంతో 30వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 23వ తేదీ నుంచి 29 వరకు రూ.200 దరఖాస్తు ఫారం తీసుకుని 30 బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పి.కన్నాపురం గ్రామంలోని ఎస్‌సి కాలనీలో నున్న నాగరాజు తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. నాగరాజుకు జనసేన పార్టీ తరఫున బుధవారం ఆర్థిక సహాయం అందించారు. బియ్యం బస్తా, కూరగాయలతో పాటు రూ.పదివేల నగదును జనసేన పార్టీ గోపాలపురం ఇన్‌ఛార్జి సువర్ణరాజు, సీనియర్ నాయకులు తరగళ్ల శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు చిలుకూరి ఫణి, వీరేంద్ర, జనసేన గుండుగొలనుకుంట నాయకులు పవన్, పి.కన్నాపురం నాయకులు అంబటి పండు, పొంగులేటి నాగరాజు, నున్న సురేష్, మచ్చు శివకృష్ణతో పాటు 17 జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఈ నెల 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంపై అవగాహనా కార్యక్రమాలు విజయవంతం చేయాలని తహశీల్దార్ టి.సాయిబాబా పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఈ నెల 25న మండలస్థాయిగా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు వినిగించుకోవడం, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మండలస్థాయిగా జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రతి పోలింగ్ బూత్ పరిధి, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా విద్యార్థులకు ఆటల పోటీలు, సీనియర్ ఓటర్లకు, స్వాతంత్ర్య సమర యోధులకు సత్కారాలు, కొత్తగా నమోదైన ఓటర్లకు కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

వృద్ధులను ఆదుకోవడం నిజమైన మానవత్వం

ప్రజాశక్తి - కలిదిండి

నిరుపేద వృద్ధులకు ఆదుకోవడం నిజమైన మానవత్వమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదలంకలో శివ దుర్గా సేవా ట్రస్ట్ అధ్యక్షులు పంతగాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసి ఛైర్మన్ ముద్దం బోగేశ్వరరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, జాన్ మంగాచార్యులు, దుగ్గిరాల పరమేశ్వరరావు, శామ్యూల్, కోకా రాజు, వాతాడి రాంబాబు పాల్గొన్నారు.

నాణ్యత లేని భోజనం పెడుతున్నారు..!

సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
ముసునూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల ఆవేదన
స్కూల్లో సామాజిక తనిఖీ బృందం పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న తనిఖీ బృంద సభ్యులు

ప్రజాశక్తి - ముసునూరు

తమకు నాణ్యత లేని భోజనం పెడుతున్నారని, నాసిరకం గుడ్లు ఇస్తున్నారని, పాఠశాలలో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు సామాజిక తనిఖీ బృందం ఎదుట వాపోయారు. పాఠశాలలో ఎస్ఆర్‌పి టి.నందిని, జిల్లా రిసోర్స్‌పర్సన్లు డి.నాగభూషణం, యు.రాజశేఖర్ బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో భోజనం శాల అపరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని, మరుగుదొడ్లకు తలుపులు సరిగ్గా లేవని, పలుమార్లు ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు. సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి దుర్వాసన వస్తుందని చెప్పినా స్పందించడంలేదన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక సిలబస్ సరిగ్గా పూర్తి కాలేదని, అంతేకాకుండా ప్రస్తుతం చెబుతున్న ఉపాధ్యాయులు సరిగ్గా అవగాహనతో చెప్పడం లేదని తెలిపారు. నైట్ వాచ్‌మెన్ కూడా లేడని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పలుమార్లు రాతపూర్వకంగా తెలియపరిచినా పట్టించుకోవడంలేదని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, రోజువారి కూరగాయలు తీసుకురాకుండా శుక్రవారం లేదా శనివారం తీసుకొచ్చిన వాటినే నాలుగైదు రోజుల వరకు ఉపయోగిస్తున్నారని ఎస్ఎంసి సభ్యులు సామాజిక తనిఖీ బృందానికి వివరించారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తనిఖీ బృందం వారు తెలిపారు.

చేపల చెరువుల లీజు సొమ్ము ఇవ్వాలి

శ్రీపర్రువాసుల డిమాండ్
మాజీ ఎంఎల్ఎ ఇంటి వద్ద 32వ రోజుకు చేరిన ధర్నా


మాజీ ఎంఎల్ఎ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న శ్రీపర్రు గ్రామస్తులు

ప్రజాశక్తి - దెందులూరు

చేపల చెరువుల లీజులు తక్షణం చెల్లించాలని టిడిపి శ్రీపర్రు ప్రెసిడెంట్ ఘంటసాల శ్రీహరి డిమాండ్ చేశారు. లీజులు చెల్లించాలని కోరుతూ శ్రీపర్రు గ్రామానికి చెందిన ప్రజలు కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద చేపట్టిన ధర్నా బుధవారంతో 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ ఐదేళ్ల లీజులు ఇవ్వాలని 32 రోజులుగా ధర్నా చేస్తున్న, అనేక గ్రామాల ప్రజలు మద్దతు తెలిపినా, మాజీ ఎంఎల్ఎ కనికరించడం లేదని, ప్రభుత్వంవారు మా మొరా ఒక్కసారి ఆలకించాలని కోరారు. గత వైసిపి హయాంలో శ్రీపరు గ్రామ చేపల చెరువులను కొట్టారని, అబ్బయ్యచౌదరి లీజుకు తీసుకున్న విషయం అంద రికీ తెలిసిందేనన్నారు. తమ వద్ద తీసుకున్న చేపల చెరువును తమ గ్రామానికి లీజు కట్టకుండా మాజీ ఎంఎల్ఎ ఎగ్గొట్టార న్నారు. లీజు డబ్బుల నిమిత్తం తాము మాజీ ఎంఎల్ఎ ఇంటి వద్ద ధర్నా కార్యక్రమాన్ని మొదలుపెట్టి 32 రోజులు కావస్తుందన్నారు. తమ గ్రామానికి మద్దతుగా కోమటిలంక, కలకుర్రు, తదితర కొల్లేటి గ్రామాల ప్రజలు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఎంత మంది ధర్నా చేసినా లీజు డబ్బులను ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్, ఎస్‌పి, ఉన్నతాధికారులు తమ మొర ఆలకించి తమకు గత ప్రభుత్వంలో మాజీ ఎంఎల్ఎ ఇవ్వాల్సిన డబ్బు లను తమకు ఇప్పిస్తారని శ్రీపర్రు గ్రామం తరపున కోరుతు న్నామన్నారు. కొల్లేటి గ్రామాల నాయకులు సైదు సత్యనా రాయణ, నేతల రవి, కలకూరు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, కోమటి లంక గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులను ప్రోత్సహించేందుకు, మార్గదర్శకం సూచించేందుకు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు దాతల రూపంలో ముందుకు రావడం అభినందనీయమని, ఇతరులకు ఆదర్శప్రాయమని భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఎన్ఆర్ఐగా ఉన్న కఠారి పుణ్యమూర్తి తన తండ్రి కోరు మాస్టారుగా పూర్వపు భీమడోలు సమితి వ్యాప్తంగా గుర్తింపు పొందిన కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి జ్ఞాపకార్థం గతేడాది నిర్వహించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తొలి మూడు స్థానాలు దక్కించుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు పురస్కారాలతోపాటు, జ్ఞాపకార్థంగా షీల్డ్‌లను అందించారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న షేక్ సబీనాకు రూ.ఐదు వేల నగదు, షీల్డ్ అందించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జహనా రజిత, నవ్యశ్రీలకు రూ.నాలుగు వేలు, రూ.మూడు వేల నగదు పురస్కారంతోపాటు షీల్డ్‌లను అందించారు. ఎన్ఆర్ఐ కఠారి పుణ్యమూర్తి తన కుటుంబ సభ్యుల మధ్య ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కఠారి కోరు మాస్టారు స్మారక ప్రతిభ పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్మారక ప్రతిభా పురస్కారాల రూపంలో విద్యార్థులకు అందించిన నగదు వారి భవిష్యత్తు అవసరాలకు సహకరిస్తుందన్నారు. వారికి గుర్తింపుగా అందించిన షీల్డులు సమాజంలో వారికి ప్రత్యేక స్థానాన్ని కల్పించడంతోపాటు ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయన్నారు. ఇతర విద్యార్థుల్లో సైతం తాము కూడా ఆ స్థాయికి చేరుకోవాలన్న తపన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అహమ్మద్‌తో పాటు కఠారి భీమేశ్వరరావు, కృష్ణ, ప్రమోజిత, కఠారి వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు అనిల్ పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా రసాయనాలు పిచికారీ

భీమడోలు : సేంద్రీయ వ్యవసాయానికి, సాగులో అమలు చేసే అధునాతన విధానాలు అనుసంధానం ఇస్తే ఫలితాలు ఉత్తమంగా ఉంటాయని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్లపట్ల గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు కేతా నాగరాజు, రామిశెట్టి రత్నారావు పక్కపక్కనే పది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పూర్తిస్థాయి సేంద్రియ విధానంలో సాగు కొనసాగుతుంది. ప్రస్తుతం పైరుపై చీడ, పీడల నివారణకు రసాయనాలను పిచికారీ చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కూలీలతో పోల్చుకుంటే వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన డ్రోన్ విధానంలో పిచికారీ చేస్తే తక్కువ వ్యవధిలో అతి తక్కువ ఖర్చుతో పైరుకు పూర్తిస్థాయి పిచికారీ అవసరాలు అందుతాయని వారికి వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా కురెళ్లగూడెం గ్రామానికి చెందిన ఒక రైతు మాత్రమే ఇంతవరకు డ్రోన్ వినియోగంపై శిక్షణ పొందారు. కాని డ్రోన్ అందుబాటులో లేకపోవడంతో కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ అధికారులతో రైతులు సంప్రదించారు. వారి సహాయ సహకారాలతో డ్రోన్ ద్వారా బుధవారం సాయంత్రం రసాయనాల పిచికారీ చేసే విధానాన్ని అమలు చేశారు. పూర్తిస్థాయిలో విజయవంతమైన సదరు ప్రయోగాన్ని గన్ని వీరాంజనేయులుతో పాటు మాజీ ఎంపిపిలు సిరిబత్తుల కొండబాబు, రామ తులసమ్మ, ఈతకోట బాబి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ యాంత్రీకరణ విధానాలకు ప్రాధాన్యతను ఇస్తుందని, రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

సర్వజన ఆసుపత్రి వద్ద మెడికల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు 18 నెలల పిఎఫ్ బకాయిలు, ఐదు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్‌కు రెండు నెలల క్రితం రాతపూర్వకంగా రాసి ఇచ్చినా బకాయిలు చెల్లించడంలో ఫస్ట్ ఆబ్జెక్టు కాంట్రాక్టర్ విఫలమయ్యారన్నారు. ఏలూరు జిల్లాలో ఉన్న ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, జనరల్ ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కార్మికులందరికీ బకాయిలు వెంటనే చెల్లించాలని, దానిపై హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీకు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారికి, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ వారికి, డిసిహెచ్ఎస్‌కు అన్ని ఆసుపత్రుల పర్యవేక్షకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24 నుంచి సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షాన 24వ తేదీ నుంచి జరిగే సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ, బ్రాంచి కార్యదర్శి బి.విజయ, ఎఐటియుసి నాయకులు కె.కన్నయ్య, వినోద పాల్గొనగా సెక్యూరిటీ సిబ్బంది మద్దతు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సహాయ సహకారాలు తీసుకోవాలని మలేరియా జిల్లా సహాయ అధికారి జె.గోవిందరావు కోరారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జె.శ్రీలక్ష్మి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మలేరియా జిల్లా సహాయ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఇందిర, ఆరోగ్య పర్యవేక్షకులు రామకృష్ణ పాల్గొన్నారు.

గోపవరంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - ముసునూరు

మొక్కజొన్న పంటలు కత్తెర పురుగు నివారణ చర్యలు ఉధృతం చేయకపోతే పంట దెబ్బ తినే పరిస్థితి ఉందని మండల వ్యవసాయాధికారి కె.చిన్న సూరిబాబు అన్నారు. మండలంలోని గోపవరంలో మొక్కజొన్న పంటలను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రాష్ట్ర ఐటి, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23వ తేదీ గురువారం ద్వారకాతిరుమల గ్రామంలో వి కన్వెన్షన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు యువ టిడిపి నాయకుడు మొగతడకల ఓం ప్రకాష్ తెలిపారు. మండలంలోని ప్రజలంతా ఈ మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలని చెప్పారు. ముఖ్య అతిథులుగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, గన్ని వీరాంజనేయులు హాజరవుతారని తెలిపారు.

లైటింగ్ ఏర్పాటుకు టెండర్ల స్వీకరణ

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పట్టిసీమలో రెండు పనులకు సంబంధించి వచ్చే నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పని చేసేందుకు టెండర్లు స్వీకరిస్తున్నట్లు గూటాల (పట్టిసీమ) పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు టెండర్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. పట్టిసీమ ఎంట్రెన్స్ నుంచి పడవల రేవు, పంట్లు వరకు 150 ట్యూబ్ లైట్లు, 25 ఫ్లడ్‌లైట్లు, 60 కెవి జనరేటర్, మైక్ సెట్టు క్రరలతో సహా లైటింగ్ ఏర్పాటు చేయడం ఒక పని, గూటాల పంపింగ్ స్కీం నుంచి బంగారమ్మపేట వినాయకుడి ఆలయం రేవు వరకు 300 ట్యూబ్ లైట్లు, ఐదు కెవి జనరేటర్, స్వాగతం బోర్డులు, క్రరలతో సహా లైటింగ్ ఏర్పాటు చేయడం రెండో పని అని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ముదినేపల్లి : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ముదినేపల్లిలోని టిడిపి కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ బుధవారం తెలిపారు.